క్లుప్తంగా

21న పేరంటాలమ్మ ఆలయంలో వేలంపాట

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 21న దేవస్థానానికి చెందిన షాపులు, ఇతర అంశాలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ షాపు నెంబరు-1, 2లతోపాటు అమ్మవార్లకు భక్తులచే సమర్పించబడిన చీరలు, రవికలు పోగుచేసుకునేందుకు లైసెన్స్, సంవత్సరం పాటు ప్రసాదం సరుకులు, పూల దండలు, శేషవస్త్రాలు సప్‌లై చేసేందుకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆశక్తి గల ఔత్సాహికులు వేలంలో పాల్గొనవలసిందిగా ఆమె కోరారు.

ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ



గన్నవరం రూరల్: మండలంలోని చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ అండ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ఆధ్వర్యంలో సీఎంఈ(కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్) వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో వర్క్‌షాప్ బ్రోచర్‌ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్, క్లినికల్ థెరపీలలో పురోగతిపై నిపుణులు ఈ వర్క్‌షాప్‌లో చర్చిస్తారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పెనమలూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చోడవరం గ్రామంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రూ. 14 లక్షలతో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, టీడీపీ నేతలు కోయా ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, శ్రీధర్, బాలకోటేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పెదపులిపాకలో సర్పంచ్ గుంటూరు శ్రీనివాసాచౌదరి అధ్యక్షతన పల్లెపండుగ జరిగింది. రూ. 2 కోట్లతో గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

రమేష్‌చంద్‌కు ఘన నివాళి



ఉంగుటూరు: వల్లభనేని అరుణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తండ్రి రమేష్‌చంద్ వర్ధంతి సందర్భంగా పలువురు అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. ఉంగుటూరులోని రమేష్‌చంద్ స్మృతివనంలో ఆయన స్థూపం వద్ద వంశీమోహన్ భార్య పంకజశ్రీ, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, పొణుకుమాడు సర్పంచ్ అన్నే సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సురెడ్డి మణిమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం, రంగా, రాజా, చింతల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



ఉంగుటూరు: ఎలుకపాడులో సీబీఎస్‌సీ పాస్టర్స్ కాన్ఫరెన్స్ వెస్ట్ ఉయ్యూరు ఫీల్డ్ చర్చస్ సహకారంతో గురువారం 120మంది వరద బాధిత కుటుంబాలకు చీర, టవల్, దుప్పటి, లుంగీలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉయ్యూరు ఫీల్డ్ అధ్యక్షుడు పాస్టర్స్ కాన్ఫరెన్స్ ట్రెజరర్ రెవ పాస్టర్ తిరివీధి పీటర్ మాట్లాడుతూ ఇప్పటికే తమ ఫీల్డ్ తరుపున 300మంది వరద బాధిత కుటుంబాలకు సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ మున్నంగి నిరీక్షణరావు, బ్రదర్ నిత్యానందం, మాజీ సర్పంచ్ నీరీక్షణరావు, అమృతరాజు, రమేష్, యెహోషువ, దాసు పాల్గొన్నారు.



ఉప్పలూరు-కేసరపల్లి మధ్య బుడమేరుపై ఉన్న బ్రిడ్జి



శిథిలమైన ఇనుప రెయిలింగ్

బుడమేరుపై డేంజర్ బెల్స్

- వరద ఉధృతికి ధ్వంసమైన లో-లెవల్ బ్రిడ్జి (కాజ్‌వే)
- శిథిలమైన ఇనుప రెయిలింగ్
- ప్రమాదభరితంగా మారిన రాకపోకలు

కంకిపాడు: బుడమేరుపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. కాజ్‌వే ధ్వంసమవుతుండటం, శిథిలావస్థకు చేరువ అవుతుండటంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. రాకపోకలు సజావుగా సాగక వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జిపై నిర్మించిన ఇనుప రెయిలింగ్ ధ్వంసం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రజల్ని వెంటాడుతోంది. కంకిపాడు మండలం ఉప్పలూరు-గన్నవరం మండలం కేసరపల్లి గ్రామాల మధ్య గుండా బుడమేరు ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న మురుగుతో దిగువకు ప్రవహిస్తుంది.

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

కంకిపాడు-గన్నవరం రోడ్డు మార్గం బుడమేరు మీదుగా సాగేందుకు వీలుగా లో-లెవల్ బ్రిడ్జిని నిర్మించారు. ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల తాకిడికి బ్రిడ్జి పునాదులు కదులుతున్నాయి. పగుళ్లువారిపోతున్నాయి. దీనికి తోడు ఇటీవల సంభవించిన బుడమేరు వరద ఉధృతికి బ్రిడ్జి మరింత ధ్వంసమైంది. సుమారు ఐదు రోజులు పైగా వరదనీరు బ్రిడ్జి, కంకిపాడు-గన్నవరం రోడ్డు మీదుగా ప్రవహించింది. దీంతో బ్రిడ్జి మీద ఉన్న రోడ్డు కూడా గోతులమయంగా మారింది. రహదారి అధ్వానంగా తయారవ్వడంతో రాకపోకలు సజావుగా సాగక వాహనదారులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.



పూర్తిగా వాలిపోయిన ఇనుప రెయిలింగ్

ధ్వంసమైన రెయిలింగ్

బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ నిమిత్తం ఇనుప రెయిలింగ్ నిర్మించారు. అయితే బుడమేరు ఉధృతితో ఇనుప రెయిలింగ్ దెబ్బతింది. కంకిపాడు, గన్నవరం మార్గాల నుంచి వచ్చే వాహనాలు రెయిలింగ్‌ను ఢీకొనడంతో రెయిలింగ్‌లు ధ్వంసమయ్యాయి. శిథిలమై, పూర్తిగా బుడమేరులోకి వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. రక్షణ నిమిత్తం ఏర్పాటుచేసిన రెయిలింగ్ దెబ్బతినడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. యుద్ధప్రాతిపదికన బ్రిడ్జిని అభివృద్ధి చేసి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

బుడమేరుపై ఉన్న కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. ఉప్పలూరు వద్ద రైవస్ కాలువపై ఉన్న వంతెన, కాజ్‌వే, కేసరపల్లి వద్ద ఏలూరు కాలువపై ఉన్న వంతెన అభివృద్ధి, రహదారి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రూ. 125 కోట్లతో అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. కేంద్రానికి కూడా ప్రతిపాదనలు పంపడం జరిగింది. నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నాం.

–మల్లికార్జున్, ఆర్అండ్‌బీ, ఏఈ, కంకిపాడు

తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. పోరంకిలో గురువారం తాడిగడప మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయం పెంచడానికి ఇంటి, నీటి, ఆస్తి పన్నులకు కొత్త అంచనాలు తయారు చేయాలని అన్నారు. పన్నుల బకాయిలు గుర్తించి విధిగా వసూళ్లు చేయాలని ఆదేశించారు. బందరు రోడ్డు పక్కన డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఏ అధికారులతో మాట్లాడారు. అనధికార లేఅవుట్లు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కానూరులోని తులసీనగర్, వృద్ధుల ఆశ్రమం ప్రాంతంలో డ్రెయినేజీలను పరిశీలించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగు పర్చడానికి కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలాషారోన్, తాడిగడప కమిషనర్ భవానీప్రసాద్, తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గుడి, బడికి దగ్గరలో మద్యం దుకాణాలు

గన్నవరం: మద్యం సిండికేట్‌గా ఏర్పడిన టీడీపీ నేతలు గన్నవరం ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టరాజ్యంగా వైన్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలు, విద్యా సంస్థలు, జనవాసా ప్రాంతాల్లో మద్యం దుకాణాలను పెట్టడంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే స్థానిక దావాజీగూడెం రోడ్డులో సెయింట్‌జాన్స్ హైస్కూల్, చైతన్య కళాశాలకు కూతవేటు దూరంలో ఇళ్ల మధ్య వైన్‌షాపును ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది విద్యార్థులు చదువుకునే ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టడంపై నిరసనలకు సిద్ధమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామ శివారుల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారని గుర్తుచేస్తున్నారు. టీడీపీ నేతలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా బడి, గుడి పక్కనే వైన్‌షాపుల పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శివాలయం పక్కనే మద్యం దుకాణాన్ని టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టడంపై విమర్శలకు దారితీస్తోంది.



సెయింట్‌జాన్స్ హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన వైన్‌షాపు



గన్నవరం శివాలయం దగ్గరలో ఏర్పాటు చేసిన వైన్‌షాపు

స్కానింగ్ కేంద్రాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారిణి గీతాబాయ్

పెనమలూరు: జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు చట్ట ప్రకారం నమోదు చేసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి జి. గీతాబాయ్ అన్నారు. కానూరులో గురువారం ఆమె ఎస్‌డీ హెల్త్ కేర్ క్లినిక్ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గీతాబాయ్ మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు నిబంధనల మేరకు పని చేయాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ చట్ట ప్రకారం నమోదు చేసుకోవాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగనిర్ధారణ చేస్తే శిక్షార్హులని, ఐఎంఏ గుర్తింపు రద్దు చేస్తామన్నారు. జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయిలో సిబ్బందిలో అవగాహన కల్పిస్తామని వివరించారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భవతులను స్కానింగ్ చేయాలంటే అనుమతులు తీసుకోవాలని అన్నారు. జిలాల్లో అన్ని వైద్యశాలలు, క్లీనిక్‌లు నమోదు చేసుకోవాలని అలా నమోదు కాని ఆస్పత్రులపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు జి. రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, లేబోరేటరీలు, స్కానింగ్ సెంటర్లను గురువారం డీఎంహెచ్‌వో గీతాబాయి తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల అనుమతి పత్రాలు, వైద్యుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ఆమె పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పిల్లల వైద్య విభాగం, లేబోరేటరీలకు అనుమతులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ అనుమతికి దరఖాస్తు చేయాలని, అప్పటి వరకు సేవలు నిలిపివేయాలని వారిని ఆదేశించారు. అనంతరం బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి ఆరా తీశారు.



కానూరులో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న గీతాబాయ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు కేసరపల్లి, ఎస్ఏ ల్వీ విల్లాస్, అప్పారావు, అజ్జంపూడి, బుద్ధవరం, బూతుమిల్లిపాడు, జక్కులనెక్కలం జగనన్న కాలనీ, వీఎస్. పురం కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, మేఘ్న రోడ్డు, వేపకుంట, కాటా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నున్న దేవస్థానం ఈఓగా హేమలత దేవి

నున్న(విజయవాడరూరల్): దేవదాయ శాఖ నున్న గ్రూప్‌లోని ఆలయాలకు కార్యనిర్వాహణాధికారిగా ఎస్.హేమలత దేవిని ప్రభుత్వం నియమించింది. నున్న గ్రామంలో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలు ఉన్నాయి. వేద్రాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి నున్న గ్రామానికి బదిలీపై హేమలత వచ్చారు.

జీతాలు లేక బిక్షాటన చేసిన డ్రైవర్లు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు జీతాలు లేక బిక్షాటన చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 42 చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో డ్రైవర్లు గత నాలుగు రోజులుగా సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం కామయ్యతోపులో భిక్షాటన చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యాన్ డ్రైవర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సగటు కార్మికుడు జీతాలు లేకుండా ఎలా జీవించగలుగుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్ దృష్టికి సమస్య తీసుకువెళ్లగా పరిష్కారిస్తామని హామీ ఇచ్చినా.. నేటికీ జీతాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు నవీన్, నరసింహారావు, జె. బ్రహ్మం, సత్రం శ్రీను, పలువురు నాయకులు పాల్గొని వ్యాన్ డ్రైవర్లుకు మద్దతు తెలిపారు.



కామయ్యతోపులో బిక్షాటన చేస్తున్న చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు

జనావాసాలకు దూరంగా బాణసంచా దుకాణాలు

పెనమలూరు: దీపావళి పండుగ సందర్భంగా వ్యాపారులు బాణసంచా దుకాణాలు జనావాసాల మధ్య ఏర్పాటు చేయడానికి అనుమతులు లేవని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాణసంచా విక్రయించే దుకాణాలు రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలు, జాతీయ రహదారి పక్కన, పార్కింగ్ ప్రదేశాల్లో ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో వ్యక్తి అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరుకు చెందిన కనగాల బాపూజీ పెయింటర్‌గా పని చేస్తాడు. విభేదాల కారణంగా అతని భార్య గత కొద్ది కాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా ఈ నెల 15వ తేదీన రాత్రి కనగాల బాపూజీ ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. ఈ ఘటనపై తల్లి కనగాల నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



గన్నవరం ఎంపీడీఓ ఆఫీస్‌లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు



కంకిపాడులో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీఓ టి. స్వర్ణలత, పలువురు అధికారులు పూలమాలలు వేశారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి అందరికి ఆదర్శనీయులని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి డి. బాబూరావు, పాఠకులు పుష్పాంజలి ఘటించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగాయి. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి. విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: వాల్మీకి మహర్షి భరత జాతికి స్ఫూర్తి అని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె. కృపానందం కీర్తించారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పలువురు గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి హనుమాన్‌జంక్షన్‌లో గురువారం జరిగింది. స్థానిక ఐటీఐ రోడ్డులోని షిర్డీ సాయిబాబా గుడి నుంచి నారాయణ స్కూల్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని పూలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్, సమరసత సేవ ఫౌండేషన్ ధర్మ ప్రచాకర్ యడవల్లి పాండురంగారావు, మండల కోకన్వీనర్ శ్రీహరి, సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కంకిపాడు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. సత్తా చాటిన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం ఎం. అరుణకుమారి, పీడీ వీరంకి రమేష్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన పటమట హైస్కూల్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన కె. మైనశ్రీ, పి. వాగ్దేవి సత్తా చాటి రాష్ట్రస్థాయి జట్టులో స్థానం పొందారని తెలిపారు. త్వరలో సత్యసాయి జిల్లా హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ వీరంకి రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

కంకిపాడు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గోసాల హెచ్ఎంకే హైస్కూల్ విద్యార్థిని ఎంపికైంది. సత్తా చాటిన క్రీడాకారిణి యార్లగడ్డ నిరుపమను పాఠశాల ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్, డైరెక్టర్ వసంత్ కుమార్ గురువారం అభినందించారు. వారు మాట్లాడుతూ పటమటలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో నిరుపమ పాల్గొని అండర్-14 విభాగంలో రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకుందని తెలిపారు. నిరుపమను, శిక్షణ ఇచ్చిన కోచ్ కోమటి గుంట రాజును ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం ఎం. అరుణకుమారి, పీడీ రమేష్



నిరుపమను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్

పెచ్చులూడుతున్న సచివాలయ శ్లాబు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలోని 281వ వార్డు సచివాలయ కార్యాలయం బిల్డింగ్ శ్లాబు పెచ్చులు ఊడిపడటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చి వెళుతుంటారు. సచివాలయ సిబ్బంది ఇక్కడే విధులు నిర్వహిస్తుంటారు. శ్లాబు పెచ్చులు ఊడిపడటం, పిల్లర్లు క్రాకులు వచ్చి ఉండటంతో శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని ఉద్యోగులు, ప్రజలు భయపడుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మానికొండలో ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 40లక్షలతో 750మీటర్ల సీసీ రోడ్డు, తరిగొప్పలలో రూ. 27.30లక్షలతో 420మీటర్లు, వేంపాడులో రూ. 25లక్షలు, చాగంటిపాడు రూ. 7.80 లక్షలు, నందమూరు రూ. 15లక్షలు, వేమండ రూ. 20లక్షలు, ఇందుపల్లి రూ. 30లక్షలు, కొయ్యగూరపాడు రూ. 30లక్షలు, పొణుకుమాడు రూ. 6.80లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు చలమలశెట్టి రమేష్, మండల అధ్యక్షుడు బర్మా భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపాలి

ఉంగుటూరు: మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని ఆత్కూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చావ సురేష్ అన్నారు. ఆత్కూరు జెడ్పీ హైస్కూల్లో గురువారం నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యాన మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ సురేష్ పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు ఒక్కసారి అలవాటు పడితే వాటికి బానిసలుగా మారతారన్నారు. గంజాయి అమ్మడం, కొనడం, రవాణ చేయడం నేరమని ఎవరైనా పట్టుబడితే చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని చెప్పారు. ఈ చట్టం ప్రకారం గంజాయి కేసులో మేజర్లకు ఎలాంటి శిక్ష అమలు చేస్తారో మైనర్లకు కూడా అటువంటి శిక్షలే అమలవుతాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ ద్వారా చికిత్స చేసి సాధారణ స్థితికి తీసుకురావచ్చని వివరించారు. నూజివీడు మండలం పోనసనపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని.. వివరాలకు 9490492020 ఫోన్ నంబరును సంప్రదించవచ్చని సూచించారు. హెచ్ఎం కె.వి.బి.కె. సుధాకర్, ఉపాధ్యాయులు మహేశ్వరి దేవి, బాలకృష్ణ, నవజీవన్ బాల భవన్ కోఆర్డినేటర్ డి. విజయరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్కూరు జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్